

స్పందనలో 314 అర్జీలు స్వీకరణ

ఏలూరు: స్పందన కార్యక్రమంలో అందిన వినతులను సత్వరం పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, డిఆర్ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, జెడ్‌పి సిఇఒ రవికుమార్, ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచలకిషోర్, వ్యవసాయశాఖ జెడి రామకృష్ణతో కలిసి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ప్రజల సమస్యలను విని నాణ్యమైన పరిష్కారాన్ని ఎండార్స్‌మెంట్ రూపంలో అందజేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. వివిధ శాఖలకు చెందిన అర్జీలు మొత్తం 314 వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణంగా పరిశీలించి పారదర్శకంగా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఒకే అంశంపై పదేపదే అర్జీలు నమోదు కాకుండా అధికారులు దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా ఆక్వా చెరువుల తవ్వకాలేమిటీ

ఆక్సిజన్‌ప్లాంట్ నిర్మాణంపై ప్రజాభిప్రాయం పట్టించుకోరా
కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన కదంతొక్కిన బాధితులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలోని కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, కలిదిండి, ఏలూరు మండలాల్లో అక్రమ ఆక్వా చెరువుల తవ్వకాలు, ప్రజాభిప్రాయానికి భిన్నంగా కైకలూరు మండలం నర్సాయపాలెంలో ఫిషరీస్ ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణం తక్షణం ఆపాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద బాధిత ప్రజలు కదం తొక్కారు. తమకు న్యాయం చేయాలంటూ నినదిస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి ఫ్ల కార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ధర్నా నుద్దేశించి లిసీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.ఎన్.వి.డి ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళి రావు, నర్సాయపాలెం గ్రామ సర్పంచ్ కె.రాధాకష్ణ, సీతారాంపురం అగ్రహారం గ్రామ సర్పంచ్ పర్సా వెంకటస్వామి, కానుకొల్లు ఆక్వా చెరువులు వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు ఎల్లమెల్లి మరియరాజు మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా యదేచ్ఛగా, అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. మండవల్లి మండలం కానుకొల్లులో, కలిదిండి మండలం సీతారామపురం అగ్రహారంలో, కొండంగిలో, సానారుద్రవరంలో, ముదినేపల్లి మండలం దేవపూడి, ఊటుకూరు తదితర గ్రామాల్లో ప్రజల ఆవాసాలు, తాగునీటి చెరువులు, బావులు, పంటచేల మధ్య ఎటువంటి అనుమతులూ లేకుండా అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వుతున్నారని చెప్పారు. ఇదేకాకుండా నియోజకవర్గమంతటా పలుచోట్ల నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఆక్వా చెరువుల తవ్వకాలు సాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే వ్యవసాయ పనులు పూర్తిగా తగ్గిపోయి ఉపాధి కరువై, తాగునీరు కలుషితమై కిడ్నీల్లో రాళ్లు, కేన్సర్ వంటి రోగాలబారిన పడి ప్రజలు



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న నేతలు, బాధిత ప్రజలు

ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటచేలు చౌడుబారిపోతున్నాయని పేద, కౌలు రైతులు వాపోతున్నా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ప్రజాభిప్రాయాలకు భిన్నంగా కైకలూరు మండలం పల్లెవాడ రెవెన్యూ నర్సాయపాలెంలో ఫిషరీస్ ఆక్సిజన్ ప్లాంట్ నిర్మిస్తున్నారని అన్నారు. అధికారులు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సభలో గ్రామస్తులంతా ముక్తకంఠంతో వ్యతిరేకించినా అనుమతులు మంజూరు చేయడం దారుణమన్నారు. కొల్లేరు ఐదో కాంటూరు పరిధిలో తాగునీటి చెరువు, జగనన్న ఇళ్ల కాలనీకి చేర్చి నిర్మిస్తున్న ఈ ప్లాంట్ ప్రజారోగ్యానికి, పర్యావరణానికి చేటు కల్గిస్తుందన్నారు. ప్రజల ఆవాసాలకు దూరంగా నిర్మించుకోవాలని కోరారు. ప్లాంట్ వ్యర్థాలు, తాగునీటి చెరువులోకి, గ్రామంలోకి చేరి తమ ప్రాణాలకు హాని కలుగుతుందని వాపోతున్నా ఏకపక్షంగా పనులు చేస్తున్నారని వివరించారు. జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమ ఆక్వా చెరువుల తవ్వకాలను, నర్సాయపాలెంలో ఫిషరీస్ ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణం నిలుపుదలకు తగు ఆదేశాలు ఇచ్చి బాధిత ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రజల ఆవాసాలు, మంచినీటి చెరువులు, బావులు, వరి పంట భూములు పక్కన ఆక్వా చెరువుల తవ్వకాలకు అనుమతులు ఇవ్వరాదన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి ఆక్వా చెరువు తవ్వుతున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆక్వా చెరువుల అక్రమ త్రవ్వకాలపై ఆందోళన చేస్తున్న దళితులు, పేదలపై పోలీసు బెదిరింపులు అక్రమ కేసులు ఆపాలన్నారు. మండవల్లి మండలం కానుకొల్లు దళితులపై పోలీసుల వేధింపులు, కలిదిండి మండలం ఎస్ఆర్‌పి అగ్రహారం గ్రామ ప్రజలపై బనాయించిన పోలీసు కేసులు ఎత్తివేయాలన్నారు. కైకలూరు మండలం నత్తగుళ్లపాడు గ్రామంలో పశువుల చెరువును పూడిక చేయకుండా హైకోర్టు తీర్పుకు అనుగుణంగా ఆపాలన్నారు. అనంతరం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు సిపిఎం నాయకులు, బాధిత ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. కొద్దిసేపు కలెక్టర్ ఆ సమస్యలపై చర్చించారు. పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి.శివనాగరాజు, పి.రమేష్, ఎల్లమెల్లి ఆనందరావు, ఎల్లమెల్లి సునీత, మెరుగు రాంబాబు, ఎం.రవి, జాజుల వాసు, కట్టా సిరాబంది, పడమటి పాపారావు, గుండాబత్తుల యెహోషువా, కాకాని సావిత్రమ్మ, మన్నే నాని, మన్నే రమేష్, కలగటూరి సుబ్బారావు, కలగటూరి రాఘవులు, గద్దె అనిల్‌కుమార్, ఎం.వంశీ తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్

పారిశుధ్యం బాధ్యత ప్రధానోపాధ్యాయులదే

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ

ప్రజాశక్తి - పెదపాడు

ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్యం బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని, దీనిపై ప్రతిఒక్కరూ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల పరిసరాలు, మరుగుదొడ్లు, పారిశుధ్యం పరిశీలించి, విద్యా ప్రమాణాల స్థాయిని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా అపరిశుభ్ర పరిస్థితులు ఏర్పడితే అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. పాఠశాలల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని, దోమలు పెరగకుండా, మురుగు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలన్నారు. మరుగుదొడ్లు, విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునే ప్రదేశాలు అపరిశుభ్రంగా ఉండటంపై ప్రధానోపాధ్యాయులపై పద్మశ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు-నేడు కింద కొత్తూరు జెడ్‌పి హైస్కూల్‌లో రూ.కోటీ 23 లక్షలతో అదనపు తరగతి గదులు, మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. పాఠశాలలో నాడు-నేడు పనులను ఆమె పరిశీలించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో బిసి సెల్ జిల్లా అధ్యక్షులు గంటా ప్రసాదరావు, ఎంపిపి బత్తుల రత్నకుమారి, ఎంఇఒ డివి.రమణ, స్కూల్ కమిటీ ఛైర్మన్ సిహెచ్.పెద్దిరాజు, కడిమి గోవిందరావు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు
జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ

సంక్షేమం, అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వానికి రెండు కళ్లు అని జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అన్నారు. మండలంలోని కొత్తముప్పర్రులో సోమవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అర్హులకు వారి ఇళ్ల వద్దకే అందజేస్తుందన్నారు. గత ప్రభుత్వ కాలంలో రాష్ట్రంలో కుంటుపడిన అభివృద్ధిని సిఎం జగన్ పరుగులు తీయించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అర్హులైన లబ్ధిదారులకు వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అదే గ్రామసభలో అందజేసేందుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేసి మొక్కలు నాటారు.

పేదలపై అక్రమ కేసులు దారుణం

భూస్వాములపై చర్యలు కోరుతూ వ్యకాస ధర్నా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పేదలపై అక్రమ కేసులు బనాయించిన భూస్వాములపై చర్యలు తీసుకోవాలని భూస్వాములతో కుమ్మక్కై పేదలను భయభ్రాంతులకు గురిచేస్తున్న పోలీసుల వైఖరి నశించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట బాధిత పేదలతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం మాట్లాడుతూ మండలంలోని ఎ.పోలవరం చిన్నవారిగూడెం ఎర్రకాలువ ప్రాజెక్టు భూముల్లో పేదలు నాటిన కొబ్బరి మొక్కలు పీకేసి దళిత మహిళలపై దాడి చేసి, కులం పేరుతో దూషించిన భూస్వాములపై చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను డిమాండ్ చేశారు. ఇరిగేషన్ భూముల్లో పేదలు గత సంవత్సరం నుంచి కొబ్బరి మొక్కలు వేసుకొని పశువులకు పచ్చ గడ్డి మేత వేసుకొని జీవిస్తున్నారని తెలిపారు. ఇది ఓర్వలేని భూస్వాములు పేదలు వేసుకున్న కొబ్బరి మొక్కలు తొలగించి, ఆ మొక్కలు మేమే వేశామంటూ పేదలు పీకేసారని పోలీస్ స్టేషన్లో పేదలపై



నినదిస్తున్న పేదలు

తప్పుడు కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. గత 40 సంవత్సరాల నుంచి ఇదే భూముల్లో భూస్వాములు దర్జాగా పంటలు వేసి అనుభవిస్తున్నారని, ఆ భూములు పేదలకు సాగుకు ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులను కోరారని గుర్తు చేశారు. నేటికీ ఇరిగేషన్ అధికారుల అండతో భూస్వాములు ఆ భూముల్లో సాగు చేస్తున్నారని తెలిపారు. ఈ నెల 10న పేదలు పెట్టిన మొక్కలు పీకేసి అడ్డొచ్చిన మహిళలను కొట్టి కులం పేరుతో దూషించి తిరిగి పేదలపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని ఆరోపించారు. పేదలు కూడా భూస్వాములు తమను కొట్టి కులం పేరుతో దూషించారని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు స్పందించలేదని వాపోయారు. అలాగే భూస్వాములు పెట్టిన కేసుపై సిఐ పి.రాజేష్ ఫోన్ చేసి మీరు స్టేషన్‌కు వచ్చి సమాధానం చెప్పకపోతే కేసు నమోదు చేసి జైల్లో పెడతామని పేదలను బెదిరిస్తున్నారని తెలిపారు. ఇరిగేషన్ భూముల్లో ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేయకుండా పేదలపై కేసులు ఎందుకు నమోదు చేస్తారో ప్రజలకు తెలియజేయాలని పోలీసులను ప్రశ్నించారు. తక్షణమే మహిళలపై దాడి చేసిన భూస్వాములపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, భూస్వాములతో కుమ్మక్కై పేదలపై కేసులు నమోదు చేస్తున్న పోలీసుల నిరంకుశ వైఖరి వీడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పేదలందరినీ ఐక్యం చేసి పోలీస్ స్టేషన్ వద్ద ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకర్‌రావు, యాగంటి సీత, మొగలి మంగ, తోనం సోమాలమ్మ, బత్తుల సత్యనారాయణ, వీరవల్లి ఆంజనేయులు, డి.వెంకటేశ్వరరావు, జి.వెంకాయమ్మ, డి.వాణి, దోలా సుశీల, రంగం సుబ్బమ్మ పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - కలిదిండి



రిబ్బన్ కట్ చేస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్

స్థానిక పంచాయతీ కార్యాలయ సమీపంలో రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పరిపాలనా సౌలభ్యంతోపాటు సత్వర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి బొర్రా సత్యవతి, వైస్ ఎంపిపి కూసంపూడి దుర్గాభవాని, కలిదిండి, గుర్వాయిపాలెం, పడమటిపాలెం సర్పంచులు మసిముక్కు మారుతీ ప్రసన్న వెంకటేశ్వరరావు, బత్తిన ఉమామహేశ్వరరావు, సానా మీనా సరస్వతి, ఎస్.రాము, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

విఎస్ఎస్‌ల సమస్యలు పరిష్కరించాలి

రూ.5 లక్షల వేతన బకాయిలు విడుదల చేయాలి - డిఎఫ్ఒకు వ్యకాస వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అటవీ వన సంరక్షణ సమితుల్లో పని చేస్తున్న కూలీలకు వెంటనే వేతనాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. వన సంరక్షణ సమితుల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అటవీ శాఖాధికారి రవీందర్ ధామా (డిఎఫ్ఒ)కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ ఉంగుటూరు మండలం గొల్లగూడెంలో సుమారు పది హెక్టార్లలో మిక్సడ్ ప్లాంటేషన్ వేశారన్నారు. దీనిలో అటవీ సంరక్షణ, మొక్కలు పెంచడం కోసం కూలీలు పనులు చేస్తున్నారని తెలిపారు. వారికి సుమారు మూడు నెలల నుండి వేతనాలు అందక నానావస్థలు పడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికే రెండు, మూడు దఫాలుగా అటవీ శాఖాధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్ళినా పరిష్కారం కాలేదని విమర్శించారు. కూలీలు వన సంరక్షణ సమితుల్లో మొక్కలు లోడింగ్, అన్‌లోడింగ్, ట్రాన్స్‌పోర్ట్, ప్లాంటేషన్, బర్లింగ్, ఫీడింగ్, టేకింగ్, సోయల్ వర్క్ వంటి తదితర పనులు చేసిన కూలీలకు ఇవ్వాల్సిన వేతనాలు నేటికీ ఇవ్వలేదని తెలిపారు. సుమారు 11 వందల మంది 84 రోజులపాటు పని చేస్తే ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఈ విఎస్ఎస్‌ల్లో రోజ్‌వుడ్, వెదురు, నెమలి, మద్ది వంటి మొక్కలను పెంచుతున్నారని, ఇవి పర్యావరణాన్ని కాపాడటమే కాకుండా కలపకు అన్ని రకాలుగా ఉపయోగపడుతున్నాయని తెలిపారు. జిల్లా శాఖాధికారులు వెంటనే స్పందించి విఎస్ఎస్‌కు ఇవ్వాల్సిన సుమారు ఐదు లక్షల వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే కాలంలో పెద్దఎత్తున జిల్లాలోని అన్ని విఎస్ఎస్‌లను ఐక్యం చేసి పోరాటానికి సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం డిఎఫ్ఒ రవీందర్ దామా మాట్లాడుతూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని, కొన్ని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఛైర్మన్ కొమ్ము బజారు, అధ్యక్షులు షేక్ షరీఫ్, పుల్లా నాగేశ్వరరావు, పుల్లా నర్సయ్య పాల్గొన్నారు.

కాంపోజిట్ సిలిండర్‌నే వాడండి

ఎల్‌పిజి జిల్లా మేనేజర్ ఎంవిఆర్.ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కాంపోజిట్ సిలిండర్ వాడటం ద్వారా అధిక భద్రత పొందటమే కాక ప్రాణహాని నుంచి తప్పించుకోవచ్చని ఎల్‌పిజి జిల్లా మేనేజర్ ఎంవిఆర్.ప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద కాంపోజిట్ సిలిండర్‌పై అవగాహన శిబిరాన్ని శ్రీ విశ్వనాథ ఏజెన్సీ ద్వారా ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పాల్గొన్న ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక ఇండేన్ గ్యాస్ కంపెనీ మాత్రమే ఈ కాంపోజిట్ సిలిండర్లను ఒక సంవత్సరం నుంచి వినియోగదారులకు అందిస్తుందన్నారు. పూర్తి ఫైబర్‌తో తయారయ్యే ఈ కాంపోజిట్ సిలిండర్ వల్ల మంటలు అంటుకున్నా పేలదని, కరిగిపోతుందని, ప్రజలకు ప్రాణహాని ఉండదని తెలిపారు. 10 కేజీల గ్యాస్‌తో లభ్యమయ్యే ఈ సిలిండర్ కోసం రూ.3500 డిపాజిట్ చేయాలని, రీఫిల్లింగ్ కోసం 10 కేజీల గ్యాస్‌కు రూ.813 చెల్లించాలని వివరించారు. వివిధ ఇండేన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వరదల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

సమీక్షా సమావేశంలో జెసి బి.లావణ్యవేణి

ప్రజాశక్తి - కుక్కునూరు

గోదావరి వరదల పట్ల అధికారులు అన్ని వేళల్లో అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అధికారులను కోరారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులతో గోదావరి వరదలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లావణ్యవేణి మాట్లాడుతూ గోదావరి వరదల పట్ల అధికారులు అన్ని వేళల్లో అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భద్రాచలంలో వరద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తే ముందస్తుగా వరద ముంపునకు గురయ్యే గ్రామాలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. వరదల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉంటూ సమన్వయం చేసుకుంటూ ఏఒక్కరికీ ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ముందస్తుగానే రేషన్, ఇతర నిత్యావసరాలను తరలించి బాధితులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య పనులపై దృష్టి సారించి బ్లీచింగ్ చల్లించాలని, వైద్యులు అందుబాటులో ఉండాలని కోరారు. వరద సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో కెఆర్‌పురం ఐటిడిఎ పిఒ జివివి.సత్యనారాయణ, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఝాన్సీరాణి, కుక్కునూరు తహశీల్దార్ ప్రమాద్వర, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి లావణ్యవేణి

రక్తదానం ప్రాణదానంతో సమానం

ఎన్ఆర్ఐ కళాశాల ఛైర్మన్ ఆర్.వెంకట్రావు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి



మాట్లాడుతున్న వెంకట్రావు


రక్తదానం ప్రాణ దానంతో సమానం అని, ప్రతిఒక్కరూ రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడిన వారవుతారని ఎన్ఆర్ఐ కళాశాల ఛైర్మన్ ఆర్.వెంకట్రావు అన్నారు. మండల పరిధిలోని పోతవరప్పాడు ఎన్ఆర్ఐ కళాశాలల్లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాగభాస్కర్ మాట్లాడుతూ ప్రాణాలు కాపాడటంలో రక్తదాతల పాత్ర కీలకమన్నారు. జనాభాలో 37 శాతం మంది రక్తదానం చేయడానికి అర్హులైతే, కేవలం ఐదు శాతం మాత్రమే రక్తదానం చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా 137 మంది విద్యార్థులు రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ మిరియాల వెంకటేశ్వరరావు, శ్రీనివాస్‌రెడ్డి, అచ్చుతబాబు, కైలరావు, రాగసాయి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదలకు అసైన్డ్ భూములు పంపిణీ చేయాలి

సిపిఎం వినతి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

అసైన్డ్ భూముల చట్ట సవరణను వెంటనే ఉపసంహరించుకోవాలని, పేదలందరికీ అసైన్డ్ భూముల పంపిణీ వెంటనే చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి చాకిరి శివనాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివనాగరాజు మాట్లాడుతూ అసైన్డ్ భూములపై యాజమాన్యపు హక్కులను కల్పించటం కోసం ఇటీవల మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం కేవలం పేదల భూములను ధనవంతులకు కట్టబెట్టడానికి మాత్రమే ఉపయోగపడుతుందని, సదరు చట్ట సవరణను వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. ఈ స్పందన కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సత్తు కోటేశ్వరరావు, షేక్ జహాంగీర్‌భాషా, సుభాని పాల్గొన్నారు.



వినతి అందిస్తున్న నేతలు

జన సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎంఎల్ఎ తెల్లం బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జన సంక్షేమమే జగన్ ప్రభుత్వ లక్ష్యం అని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా దర్భగూడెం పంచాయతీలోని లక్ష్మీపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ గడిచిన నాలుగు సంవత్సరాలుగా పలు అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ఒక్క వైసిపి ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వసంతరావు, సర్పంచి సున్నం ఉషారాణి, సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు, ఉప సర్పంచి కె.రాఘవరెడ్డి, ఎంపిటిసిలు సున్నం సురేష్, కంచర్ల సుధారాణి, సచివాలయ కన్వీనర్ వనమా రామకృష్ణ, గూడవల్లి శ్రీనివాస్, నాయకులు సందా ప్రసాద్, బోదా శ్రీనివాస్‌చౌదరి, రెడ్డి ప్రేమ్‌కుమార్, నాయకులు కుంజా రాముడు, మాజీ సర్పంచి కోర్స వెంకటేశ్వరరావు, కక్కిరాల చక్రి, రాము, తహశీల్దార్ సుందర్‌సింగ్, సూపరింటెండెంట్ మంగతాయారు, ప్రకాశం, వేణు, సురేష్, లోకేష్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పని చేయని ఆర్‌టిసి బస్సు హెడ్ లైట్లు

ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఆర్‌టిసి బస్సు లైట్లు మరమ్మతుకు గురికావడంతో ప్రయాణికులు రాత్రి సమయంలో అవస్థకు గురైన సంఘటన మండలంలోని లక్కవరంలో చోటుచేసుకుంది. సోమవారం రాత్రి జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు భీమవరం నుండి జంగారెడ్డిగూడెం తిరిగొస్తుంది. ఈ క్రమంలో మార్గమధ్యంలో ఆర్‌టిసి బస్సు లైట్లు మరమ్మతుకు గురయ్యాయి. రాత్రి సమయంలో రోడ్డు మార్గం కన్పించే అవకాశం లేక లక్కవరంలోనే బస్సు నిలిపివేశారు. దీంతో బస్సులోని ప్రయాణికులు రాత్రి సమయంలో మరో బస్సు వచ్చేవరకు వేచి ఉండాల్సి వచ్చింది. తరచూ ఆర్‌టిసి బస్సులు మరమ్మతుకు గురై ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. కండీషన్లో లేని బస్సులను మరమ్మతు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రైతుబజారులో బియ్యం విక్రయం

ప్రజాశక్తి - కైకలూరు

పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన బియ్యం అందించేందుకు చర్యలు తీసుకున్నామని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక రైతు బజార్‌లో బియ్యం విక్రయాలను ఛైర్మన్ దండే పుష్పలత ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ సహకారంతో ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ సౌజన్యంతో సామాన్య ప్రజలకు ధరలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో బియ్యం సాధారణ రకం రూ.34, మధ్యరకం రూ.40, మంచి రకం రూ.48లకు విక్రయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు దండే రవి ప్రకాష్, ఎస్టేట్ ఆఫీసర్ నందినిదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణులకు అందుబాటులో కార్పొరేట్ వైద్యం

ప్రజాశక్తి - కైకలూరు

గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తీసుకుని రావాలనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎండి నాగరాజు తెలిపారు. సోమవారం మండలంలోని భుజబలపట్నంలో మెడికేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వైద్యులు హరీష్ కుమార్‌రెడ్డి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గురజాల రామతులసి, ఎంపిటిసి సభ్యులు సోమల శ్యామసుందర్, ఎంపిటిసి పెనుమచ్చ సూర్యనారాయణ రాజు, గ్రామ కార్యదర్శి దూలం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి ముందుగానే ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలని తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. తిమ్మిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం గ్రామ సర్పంచి గంగవల్లి శ్యామ్ శేఖర్ ఏలూరు ఆశ్రం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారిచే ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరైన తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఎటువంటి ఆరోగ్య సమస్యలున్న ముందుగానే వైద్యులను సంప్రదించి అన్ని రకాల పరీక్షలు చేయించుకుంటే అనారోగ్య సమస్య నుంచి బయటపడవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత మేకా ఈశ్వరయ్య, మాజీ సర్పంచి చిలకబత్తుల మోహన్ రావు పాల్గొన్నారు.

సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

డిఎఆర్ కళాశాల ఆవరణలో సోమవారం ఉమ్మడి కృష్ణాజిల్లా సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలుర, బాలికల జట్లకు 16 మంది చొప్పున ఎంపిక చేశారు. వీరు ఈనెల 21 నుంచి 23 వ తేదీ వరకూ రామచంద్రపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి టోర్నమెంటులో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు హీల్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు మండల పరిధిలోని హీల్ విద్యార్థులు ఎంపికైనట్లుగా హీల్ సిఇఒ కె.అజయ్‌కుమార్ తెలిపారు. ఈనెల 16న నూజివీడు డిఎఆర్ కాలేజీలో నిర్వహించిన ఉమ్మడి కృష్ణాజిల్లా సబ్‌జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీల్లో తోటపల్లి హీల్ విద్యార్థులైన సంజన, నవ్య, తనిష్కవేణి, వినీషా, నీరజ్‌లు ఎంపికైనట్లుగా ఈనెల 20వ తేదీ నుంచి 25 వరకూ జరుగు సబ్‌జూనియర్ రాష్ట్ర చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనటం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన బాలబాలికలను సిఇఒ అజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ బి.సాయిబాబు, డైరెక్టర్ భాస్కర్‌లు అభినందించారు.

అమర్‌నాథ్ గౌడ్‌ను చంపిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

గతనెలలో వైసిపి రౌడీమూకల చేతిలో హత్యచేయబడిన బిసి వర్గానికి చెందిన మైనర్ బాలుడు అమర్‌నాథ్ గౌడ్‌ని చంపిన నిందితులకు తక్షణమే కఠినంగా శిక్ష పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ఏర్పాటు చేయాలని, అమర్‌నాథ్ గౌడ్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మండల టిడిపి, బిసి సెల్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వివిధ డిమాండ్లతో కూడిన వినతిని డిటికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు శీలం వెంకటేశ్వరరావు, జయ్యవరపు శ్రీ రామమూర్తి, మండల అధ్యక్షుడు నాయుడు రామకృష్ణారావు గౌడ్ పాల్గొన్నారు.

మండవల్లి: జగన్ పాలనలో బిసిల ధన, మాన ప్రాణాలకు రక్షణ కరువైందని దీనికి నిదర్శనమే అమర్‌నాథ్ మరణమని టిడిపి మండల అధ్యక్షులు నారగాని వీర వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. రాష్ట్ర టిడిపి బిసి సాధికారత, బిసి సెల్ ఆధ్వర్యంలో లింగాల కానుకలు గ్రామాలలో ఉప్పల అమర్నాథ్ గౌడ్‌కి సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమర్‌నాథ్‌ను అతి కిరాతకంగా చంపిన దోషులను వెంటనే అదుపులోకి తీసుకుని శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జోసఫ్ తంబి, గజ్జల గణేష్, మహమ్మద్ రహిబా, కోనపురెడ్డి కోటేశ్వరావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

వ్యక్తి అనుమానాస్పద మృతి

నూజివీడు రూరల్: జంగంగూడెం గ్రామంలో బడిపాటి ప్రసాద్(48) అనే వ్యక్తి సోమవారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. ప్రసాద్ తన సహచరుడు చలపతి దాసుతో కలిసి రెండు రోజులుగా మద్యం తాగుతున్నాడు. ఈ క్రమంలో అపస్మారక స్థితిలోనికి చేరుకోవడంతో ఆసుపత్రికి తరలిస్తూ ఉండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. అనుమానాస్పద మృతిగా రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి తరలిస్తున్న వాహనాలు స్వాధీనం

నూజివీడు రూరల్: అన్నవరం చెరువు నుంచి మట్టి తరలిస్తున్నారని సమాచారం సబ్ కలెక్టర్‌కు అందడంతో వెంటనే ఆయన రెవిన్యూ ఉద్యోగులు, పోలీసులను అప్రమత్తం చేసి సంఘటనా స్థలానికి పంపారు. ఒక పొక్లిన్, లారీ, ఆరు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, విఆర్ఒలు మట్టి తరలింపు విషయంలో అప్రమత్తంగా ఉండాలని సబ్ కలెక్టర్ సూచించారు.

పాము కాటుకు బాలుడు మృతి

నూజివీడు రూరల్: నూజివీడు మండలంలోని లైన్ తండాకు చెందిన బాణావతు మహి(4) అనే చిన్నారి నిద్రిస్తున్న సమయంలో పాము కరవడంతో మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఆ సమయంలో కుమారుడి ఏడుపు వినిపించడంతో తల్లిదండ్రులు అప్రమత్తమయ్యారు. పాము కాటును గమనించి హుటాహుటిన నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఇద్దరు ఆడపిల్లల తర్వాత పుట్టిన మగ బిడ్డ చనిపోవడంతో తల్లిదండ్రులు శివాని, స్వామి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

నూజివీడు రూరల్: అక్రమంగా తరలిస్తున్న తెలంగాణ మద్యం సీసాలను నూజివీడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు ఆదివారం స్వాధీన పరుచుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ టి.గోపాలకృష్ణ తన సిబ్బందితో నిర్వహించిన దాడుల్లో ఖమ్మం జిల్లా వేంసూరు మండలానికి చెందిన పంది శివకృష్ణ టాటా మ్యాజిక్ వాహనంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ రవాణా చేస్తుండగా పట్టుబడ్డాడు. పోలీసులు మద్యం బాటిళ్లను స్వాధీన పరుచుకుని వాహనం సీజ్ చేశారు. శివకృష్ణను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు .

జిఎస్‌టి నుంచి చేనేత రంగాన్ని మినహాయించాలి

ప్రజాశక్తి - ఏలూరు

చేనేత రంగానికి మరణశాసనమైన జిఎస్‌టి నుంచి చేనేత రంగాన్ని మినహాయించాలని, చేనేతకు సంబంధించిన పట్టు, నూలు రంగులపై జిఎస్‌టిని పూర్తిగా రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం స్థానిక ఆర్ఆర్ పేటలోని సంఘం కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేనేత రంగంపై 2017లో జిఎస్‌టి భారాన్ని మోపిందని, ఈ భారాలకు వ్యతిరేకంగా చేనేత కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనా పోరాటాలు నిర్వహించారన్నారు. పట్టు, నూలు రంగు రసాయనాలపై జిఎస్‌టిని పూర్తిగా రద్దు చేయాలని ఆందోళనలు చేసినా కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. గుజరాత్ వ్యాపారులు అడిగిందే తడవుగా సూరత్ జరీపై 12 నుంచి 5 శాతానికి జిఎస్‌టిని తగ్గించటం చేనేతపై కేంద్రం దొంగ దెబ్బ తీసిందని ఆదిశేషు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఉత్పత్తి అవుతున్న 90 శాతం జరీ ఉత్పత్తులు సూరత్‌లోనే తయారవుతున్నాయి.

2017లో జిఎస్‌టి పన్నుల విధానం అమలులోకి వచ్చినప్పుడు రియల్ ఇమిటేషన్ జరీలపై 12 శాతం జిఎస్‌టి వేయాలని నిర్ణయించారు సూరత్‌కు చెందిన వ్యాపారులు. స్థానిక నాయకత్వం గుజరాత్ ప్రజా ప్రతినిధులు రియల్ జరీ పన్నును 12 శాతం నుండి ఐదు శాతానికి తగ్గించుకున్నారని మళ్లీ ఇప్పుడు అదే సూరత్ వ్యాపారులు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఇమిటేషన్ జరీపై ఉన్న 12 శాతం జిఎస్‌టిని కూడా ఐదు శాతానికి తగ్గించుకున్నారని తెలిపారు. మోడీ సర్కార్ జరిపై జిఎస్‌టిని ఏడు శాతం మేర తగ్గించి నులుతో సమానంగా ఐదు శాతానికి చేసింది. దీనిపైనే చేనేత కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుండి చేనేత రంగాన్ని విస్మరిస్తోందని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2017 నుంచి ఐదు శాతం జిఎస్‌టిని చేనేతపై విధించింది. నాటి నుంచి జిఎస్‌టిని తొలగించాలని చేనేత కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వం

కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా వివక్షపూరిత విధానాలు మార్చుకోవాలని లేదంటే మూల్యం చెల్లించుకోకతప్పదని పిచ్చుక ఆదిశేషు హెచ్చరించారు. నూలు, పట్టు రంగులు రసాయనాలపై జిఎస్‌టిని పూర్తిగా ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



వికలాంగులకు వాహనాలు అందజేస్తున్న ఎంఎల్ఎ

వికలాంగులకు రూ.10 లక్షల విలువైన మోటార్ వాహనాల అందజేత

ప్రజాశక్తి - కైకలూరు

వికలాంగుల్లో ఆత్మ విశ్వాసం నింపి వారి దైనందిక అవసరాలు తీర్చటానికి, వారి గమ్యాలను చేర్చుటకు మూడు చక్రాల స్కూటీలు ఎంతగానో ఉపయోగపడుతాయని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక రహదారి భవనంలో నియోజకవర్గ పరిధిలో జిల్లా వికలాంగుల సంక్షేమ కార్పొరేషన్ నుంచి మంజూరై వచ్చిన రూ.10 లక్షల విలువైన మూడు చక్రాల మోటార్ వాహనాలు 10 మంది వికలాంగులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడవి వెంకటకృష్ణ మోహన్, ముదినేపల్లి ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, వ్యవసాయ మార్కెట్ అధ్యక్షురాలు దండే పుష్పలత, వైస్ ఎంపిపి మహ్మద్ జహీర్, భట్రాజు శివాజీ, సర్పంచి దానం మేరీ నవరత్న కుమారి పాల్గొన్నారు.

వికలాంగ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి - నిడమర్రు

బడి బయటి వికలాంగ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, వారికి వచ్చే ఉపకార వేతనం, అలవెన్స్, ఉపకరణాలు గురించి వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని మండలం విద్యాశాఖ అధికారి-2 కె.రాంబాబు తెలిపారు. నిడమర్రు మండలంలో ఉన్న వికలాంగ పిల్లలను పాఠశాలల్లో చేర్పించడం గురించి "డ్రైవ్ ఫర్ ఐడెంటిఫికేషన్ అండ్ ఎన్రోలింగ్ ఆఫ్ చిల్డ్రన్ విత్ స్పెషల్ నీడ్స్" ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారి2 కె.రాంబాబు మాట్లాడుతూ అందరూ చదవాలి, అందరూ ఎదగాలి, వికలాంగులు కూడా బాగా చదవాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు "ప్రశాంత్" యాప్‌ను రిజిస్టర్ చేసుకుని ఉపాధ్యాయులు అందరూ వికలాంగులకు సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిడమర్రు ఎంపిపిఎస్ నెంబర్‌వన్ ప్రధానోపాధ్యాయులు చెల్లమ్మ, ప్రసన్న, సుధా, నారాయణదాసు, లక్ష్మీకాంతం, యేసు రాజు పాల్గొన్నారు.

వికాస్ గ్లోబల్ స్కూల్ పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు

విద్యార్థులకు టిసిలు ఇవ్వకుండా వేధిస్తున్న జంగారెడ్డిగూడెంకు చెందిన వికాస్ గ్లోబల్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని టి.నరసాపురం మండలం ఏపుగుంట గ్రామానికి చెందిన కొప్పుల గంగాధర్ సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గంగాధర్ మీడియాతో మాట్లాడుతూ జంగారెడ్డిగూడెంలోని వికాస్ గ్లోబల్ స్కూలులో సరైన విద్యాబోధన లేనందున, విద్యార్థులు స్కూలుకు వెళ్లడానికి రాకపోకల సౌకర్యం ఇబ్బందిగా మారిందన్నారు. దీంతో తమ పిల్లలను వేరే స్కూలులో చేర్చడానికి టిసిలు ఇవ్వమని అడిగితే సంస్థ అధినేత జగన్ దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులు చేరిన తర్వాత నేటి వరకూ ఫీజులు చెల్లించినా, అదనంగా రూ.20,30,40 వేలు చెల్లించాలని, లేనిపక్షంలో టిసి ఇవ్వను అని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ఇంతవరకూ చెల్లించిన ఫీజులకు సంబంధించి రసీదులు కూడా ఇవ్వలేదని ఇంకా అదనంగా చెల్లించాలని ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైందని ఆందోళన చెందుతున్నామన్నారు. జిల్లా కలెక్టర్ తక్షణం జోక్యం చేసుకుని తమ పిల్లలకు న్యాయం చేయాలని కోరారు.

పిహెచ్‌సిలో పూర్తిస్థాయి సిబ్బందిని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - మండవల్లి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు వైద్యం అందని ద్రాక్షగా మారిందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్ భాస్కరరావు స్పష్టం చేశారు. పిహెచ్‌సిలో పూర్తిస్థాయి సిబ్బందిని, వసతులను ఏర్పాటు చేసి 24 గంటలు రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సోమవారం రెవిన్యూ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండవల్లిలోని పిహెచ్‌సి ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకే పనిచేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతంలో పూర్తిస్థాయిలో వైద్యం అందించడంతో పాటు మహిళలకు ప్రసూతిలో వైద్య పరమైన ఇతర సేవలను కూడా అందించే విధంగా ఆరోగ్య కేంద్రాలను 24 గంటలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసిందని తెలిపారు. మండవల్లి పిహెచ్‌సి సిబ్బంది నాలుగు గంటలకే పిహెచ్‌సి మూసివేసి వెళ్లిపోవడం వల్ల రోగులకు వైద్యం అందకపోగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం నెరవేరడం లేదని ఆయన అన్నారు. ఉన్నతాధికారులు వైద్యశాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేసి, సమస్యలను పరిష్కరించి రోగులకు పూర్తిస్థాయిలో వైద్యం అందించేలా చర్య తీసుకోవాలని, 24 గంటలు వైద్యశాలను అందుబాటులోకి తీసుకువచ్చి రోగులకు వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టి.అప్పారావు, శ్యామ్ పాల్గొన్నారు.

గిరిజన హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గిరిజన బాలుర కళాశాల వసతిగృహ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు బి.వినోద్ తెలిపారు. పిడిఎస్‌యు ఆధ్వర్యంలో సోమవారం బుట్టాయగూడెం సెంటర్లో విద్యార్థులతో ప్రదర్శన, ఎంఆర్ఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిని అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు బి.వినోద్ మాట్లాడుతూ బుట్టాయగూడెం గిరిజన బాలుర కళాశాల హాస్టల్ పెచ్చులు పెచ్చులుగా ఊడుతూ శిథిలావస్థకు చేరుకుందన్నారు. వర్షాలు వస్తే స్లాబులు నీరు కారుతోందన్నారు. దీనివల్ల విద్యార్థులు భయాందోళనలకు గురవుతూ వసతి గృహంలో ఉంటున్నారన్నారు. వసతి గృహంలో విద్యార్థులు ఉండడానికి, పడుకోవడానికి సరిపోవడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ ఛార్జీలు ఇవ్వాలని, హాస్టల్‌కు నూతన భవనాలు నిర్మించాలని, పెరిగిన కూరగాయలు, నిత్య అవసర వస్తువుల ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ ఛార్జీలు పెంచి నాణ్యమైన భోజనం అందించాలని, సన్న బియ్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు పి.అనువర్ధన్, జి.వినయ్, వి.సిద్ధార్థ, జి.కోటి, టి.వివేక్, కె.విష్ణు, పి.ప్రసాద్ ఎం.నిఖిల్ పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్: ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్‌లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యార్థుల సంఖ్య తక్కువుందనే పేరుతో ఎయిడెడ్ పాఠశాలల మూసివేతను విరమించుకోవాలని, ఇతర విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు వినతిని అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పిడిఎస్‌యు జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా పాఠశాల విద్య అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. నూతన జాతీయ విద్యా విధానం-2020 పేరుతో పాఠశాలలను ముక్కలు చేశారన్నారు. సంక్షేమ హాస్టల్స్, గురుకులాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్ నాగరాజు, యు.అభిషేక్, ఎం.బాబీ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చట్టాన్ని అమలు చేయడంలో విఫలమయ్యాయని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు తెలిపారు. విశ్వకర్మ కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ సమావేశం సోమవారం జవ్వాది శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన రాంబాబు మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి గద్దెనెక్కిన తర్వాత కార్మికులను కరోనా సమయంలో ఆదుకోకుండా ఉన్న కార్మిక సంక్షేమ పథకాలను ఆపు చేశారన్నారు. 2018 నుంచి ఇప్పటివరకూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికులకు పెళ్లి కానుక, సహజ మరణాలు, డెలివరీ కేసులు, పెండింగ్ క్లైమ్‌లను వెంటనే సంక్షేమ బోర్డు నిధుల నుంచి మంజూరి చేయించి భవన నిర్మాణ కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలను బోర్డు ద్వారానే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ గంగాధరుని బ్రహ్మాజీ, కోశాధికారి కోటిపల్లి వెంకటాచార్యులు, కాలమూరు వెంకన్న, జవ్వాది గౌరీ శంకర్ పాల్గొన్నారు.

అదివాసీల సాగు భూములకు పట్టాలివ్వాలి

టి.నరసాపురం: అదివాసీలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. సాగుభూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజనులు బైఠాయించి ధర్నా చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిని డిప్యూటీ తహశీల్దార్ ఉదయ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బాష్కర్ మాట్లాడుతూ మండలంలోని బండివారిగూడెం రెవిన్యూ పరిధిలో గల ఆరు గ్రామాల అదివాసీలు సాగులో వున్న భూములను భూస్వాములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించి ఆన్‌లైన్ చేయించుకున్నారని ఆరోపించారు. అదివాసీలకు భూములు ఇచ్చిన రైతులకు నోటీసులు ఇచ్చి విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తొట్టి నారాయణ, కొట్టంకాటయ్య, సూరి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'



కాట్రేనిపాడులో పలు సమస్యలు వివరిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు జడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు(సూరిబాబు) తెలిపారు. మండలకేంద్రమైన టి.నరసాపురం సచివాలయం2 పరిధిలో స్థానిక శివాలయం కళ్యాణ మండపంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు, ఎంపిపి లబ్దిదారులకు సర్టిఫికేట్‌లు పంపిణీ చేశారు. అనంతరం జడ్‌పిటిసి మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు సురక్ష కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దారబోయిన లక్ష్మి, దేవరపల్లి ముత్తయ్య, వాసిరెడ్డి మధు, శ్రీనురాజు, కన్నం సర్వేశ్వరావు, సీతారాం ప్రసాద్, రవితేజ పాల్గొన్నారు.

చింతలపూడి: ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిదని చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమాట్ల ఎలిజా అన్నారు. వెంకటాపురం గ్రామంలో జగనన్న సురక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరే విధంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణజ్యోతి, సర్పంచి చేపూరి సాయి కూమరి, ఎంపిపి రాంబాబు, జడ్‌పిటిసి మోలుగుమాటి నిరజసుధాకర్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని మండల ప్రత్యేక అధికారి పివిఎస్ నాయుడు తెలిపారు. సోమవారం ములగలంపల్లి పంచాయతి పరిధిలో వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాల సేవలందించే కార్యక్రమమే జగనన్న సురక్ష అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సోమగాని శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు ఘంటసాల గాంధీ పాల్గొన్నారు.

పోలవరం: జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను అందిస్తున్నారని, ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి సుంకర రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.శ్రీను, ఎంఆర్ఒ బి.సుమతి, జడ్‌పిటిసి కలుం హేమ్ కుమారి, సర్పంచి కోటం గంగా దేవి సింగరాజు పాల్గొన్నారు

ముసునూరు: జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కాట్రేనిపాడు గ్రామానికే రూ.20కోట్ల 84 లక్షల 40 వేల లబ్ధి చేకూరిందని జడ్‌పిటిసి సభ్యులు డాక్టరేట్ ప్రతాప్, మండల వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన అన్నారు. సోమవారం మండలంలోని కాట్రేనిపాడు గ్రామ సచివాలయంలో గ్రామసర్పంచి గద్ధల సుహాసిని మోహనరావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైసిపి అధ్యక్షులు మూల్పురి నాగవల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. టిడిపి నాయకులు సర్పంచి గద్ధల సుహాసిని మోహనరావు, ఎంపిటిసి సభ్యులు సూర్యదేవర నాగమంజుల శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ గ్రామంలోని చెరువుల్లో మట్టిని గ్రామ అభివృద్ధికై రోడ్లకు గ్రావెల్ తోలకం జరుపుతుండగా పోలీసులకు ఫిర్యాదు చేసి ప్రోక్లెయిన్, ట్రాక్టర్లును పట్టించి, జరిమానా విధించే పరిస్థితి రావడం ఏంటని ప్రశ్నించారు. గ్రామాల్లో పలు ఏరియాల్లో శ్మశానవాటికలు ఇప్పటికీ లేవని, వాటికి స్థలాలు ఏర్పాటు చేయాలని, పాఠశాల పరిధిలోని క్రీడా స్థలం కొందరు ఆక్రమించుకున్నారన్నారు. వీటిపై చర్యలు తీసుకోవాలంటూ వినతిని అందజేసే సమయంలో వైసిపి, టిడిపి మధ్య గొడవ జరగగా పోలీసులు ప్రవేశంతో సద్దుమణిగింది. తహశీల్దార్ వారి ఆర్జీలను తీసుకుని తొందరలోనే పరిష్కరిస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి ప్రతాఫ్, ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, తహశీల్దార్ దాసరి సుధ పాల్గొన్నారు.

మండవల్లి: జగనన్న ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, పేదలకు అండగా నిలిచే ప్రభుత్వమని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు తెలిపారు. మండలంలోని పులపర్రులో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన సోమవారం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పేదవాడికి సంక్షేమ పథకాలను అందించి అభివృద్ధి చేయడమే జగనన్న ముఖ్య ఉద్దేశం అని అన్నారు. అనంతరం ధృవీకరణ పత్రాలు కావలసినవారు ఎలా దరఖాస్తు చేసుకోవాలో అనేదానిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, జడ్‌పిటిసి సభ్యురాలు ముందర విజయనిర్మల, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కుక్కునూరు: సంక్షేమ ఫలాలను నూరుశాతం అర్హులకు అందించడమే 'జగనన్న సురక్ష' కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి అన్నారు. శ్రీధర వేలేరు గ్రామంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో పాల్గొని, ప్రజలకు ధృవపత్రాలను అందించారు. ఈ సందర్భంగా జేసి లావణ్య వేణి మాట్లాడుతూ అర్హత ఉండి సంక్షేమ పథకాల అమలులో సరైన ధృవపత్రాలు లేని కారణంగా అర్హత కలిగిన కొంతమందికి పథకాలు అమలు కాలేదని, అటువంటి వారిని గుర్తించి, వారికి కూడా పథకాలు అందించాలన్నది జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

జంగారెడ్డిగూడెం: ప్రజలందరూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి కొదమజ్యోతి తెలిపారు. సోమవారం పంగిడిగూడెం గ్రామంలో సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపిపి కొదమజ్యోతి మాట్లాడుతూ ప్రజలు తమకు అవసరమైన ధృవపత్రాలను జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉచితంగా పొందాలని తెలిపారు.

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణా తరగతులు

నూజివీడు రూరల్: ట్రిపుల్ ఐటీలో ఈనెల మూడవ తేదీ నుంచి ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు సోమవారంతో ముగిసాయి. డిజిటల్ విద్యా విధానంపై నూజివీడు, లింగపాలెం, చింతలపూడి మండలాల్లోని యూపీ స్కూల్స్, హైస్కూల్‌కి సంబంధించిన 745 మంది ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఇంటర్ యాక్టివ్ ఫ్లట్ ప్యానల్స్, స్మార్ట్ టీవీలు బైజూస్ కంటెంట్ పై ట్రిపుల్ ఐటీ ఫ్యాకల్టీతో శిక్షణ ఇచ్చారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు

ద్వారకాతిరుమల: శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ద్వారకాతిరుమల శాశ్వత నిత్య అన్నదానం ట్రస్టుకు తూర్పు గోదావరి జిల్లా కాకినాడకు చెందిన రాయప్రోలు శ్రీరామ చంద్రమూర్తి, సోమవారం ఉదయం రూ.1,00,0008లు విరాళం, ఏలూరుకు చెందిన నూకల అమ్మాజీ రూ.1,00,0001లు విరాళంను దేవస్థానం ఛైర్మన్ ఎస్‌వి.సుధాకరరావుకు అందజేశారు. అనంతరం దాతల కుటుంబ సభ్యులతో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం వారు అన్నదానం బాండ్ పేపర్స్ అందించారు.

సాయినాథ్ కుటుంబానికి అండగా ఉంటాం

నూజివీడు రూరల్: లారీ ఢీకొట్టడంతో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రెవిన్యూ ఉద్యోగి గూడవల్లి సాయినాథ్(35) కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన సాయినాథ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ప్రభుత్వ దుకాణాల్లో హోల్‌సేల్ ధరకే బియ్యం

చింతలపూడి: ప్రభుత్వ దుకాణాల్లో నాణ్యమైనా బియ్యం హోల్‌సేల్ ధరకే అమ్ముతున్నట్లు చింతలపూడి తహశీల్దార్ కృష్ణజ్యోతి తెలిపారు. చింతలపూడి పట్టణంలో జిబిజీ రోడ్డులో శ్రీలలిత సాయి మిత్ర ట్రెడర్స్ వద్ద బియ్యం ధరలు నియంత్రించేందుకు పౌరసరఫరాశాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హోల్‌సేల్ షాపుని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బియ్యం ధరలు నియంత్రించేందుకు ప్రభుత్వ బియ్యం దుకాణాలు పౌరసరఫరాశాఖ ద్వారా హోల్‌సేల్ రేట్లకు అమ్ముతున్నట్లు తెలిపారు.

రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం

కలిదిండి: మండలంలోని భాస్కర రావు పేటలో రూ.20 లక్షల నిధులతో నిర్మింపతలపెట్టిన సిసి రోడ్ల నిర్మాణాలను సర్పంచి గద్దె ఆనంద్ కుమార్ ప్రారంభించారు. మొత్తం 370 మీటర్ల నిడివిగల ఆరు సిసి రోడ్లకు సచివాలయ నిధులతో పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. వైసిపి నాయకులు ఎస్ఐ రాజు, కృష్ణంరాజు, పి.వేణు, చంద్రరాజు పాల్గొన్నారు.

రెండు విద్యుత్ ఉపకేంద్రాల మంజూరు

నూజివీడు రూరల్: సిద్ధార్థ నగర్‌కు, ముసునూరు మండలం కొర్లకుంటకు విద్యుత్ ఉపకేంద్రాలు మంజూరైనట్లు విద్యుత్ సంస్థ ఎఇ ఎ.సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కొక్క దాని నిర్మాణానికి రూ.1.5 కోట్లు ఖర్చు అవుతుందని తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. వర్షాకాలంలో రైతులు విద్యుత్ స్తంభాలు, తీగల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1912 లేదా స్థానిక లైన్‌మెన్, ఎఇల దృష్టికి తీసుకురావాలన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్, లివింగ్ ఫ్రెండ్‌షిప్ యాప్స్ నిషేధించాలి

చింతలపూడి: ఆన్లైన్ బెట్టింగ్, లివింగ్ ఫ్రెండ్‌షిప్ యాప్స్ నిషేదించాలని అఖిల భారత యువజన సమైక్య ఎఐవైఎఫ్ ఏలూరు జిల్లా కో-కన్వీనర్ తోర్లపాటి రాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆన్లైన్ బెట్టింగ్ యాప్లు నిషేధించాలని కోరుతూ సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద స్పందన కార్యక్రమంలో వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సాంకేతికపరంగా అభివృద్ధి చెందుతున్న సందర్భంలో ఆన్లైన్ యాప్స్ వలన చాలామంది అమాయక ప్రజలు నష్టపోతున్నారని, బెట్టింగ్స్ యాప్స్ వలన లక్షల మంది యువత క్రికెట్ రమ్మీ, ఇతర ఆటలకు బెట్టింగులు పెట్టి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు.